క్లుప్తంగా

నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

తెనాలి: భారీ వర్షాల కారణంగా సోమవారం జిల్లాలో నిర్వహించాల్సిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ప్రకటించారు. దీంతో తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరగాల్సిన పీజీఆర్ఎస్ కార్యక్రమం రద్దయింది. ప్రజలు గమనించి ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని అధికారులు కోరారు.

వరద బాధితులకు నేడు చెక్కుల పంపిణీ

తెనాలి అర్బన్: వరదలు వల్ల నష్టపోయిన గ్రామ పంచాయతీను అదుకునేందుకు జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సొంత నిధులు రూ.4కోట్లు ప్రకటించడం అభినందనీయమని జనసేన పార్టీ నాయకులు తోటకూర రమణారావు, బండారు రవికాంత్, షేక్ ఇస్మాయేల్ పేర్కొన్నారు. బోసురోడ్డులోని జనసేన పార్టీ తెనాలి నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో 400ల పంచాయతీలు వరద బారినపడి నష్టపోయాయని తెలిపారు. ఒక్కొక్క గ్రామ పంచాయతీకి రూ.లక్ష చొప్పున వాటిని వెచ్చించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా తెనాలి, కొల్లిపర మండలాల్లోని రెండు గ్రామాలు, కొల్లూరు మండలంలోని 14, రేపల్లె మండలంలో ఒకటి, భట్టిప్రోలు మండలంలో నాలుగు, కాకుమాను మండలంలోని రెండు గ్రామాలకు చెందిన చెక్కులను సోమవారం సాయంత్రం ఐదు గంటలకు తెనాలిలోని నూకల రామకోటేశ్వరరావు కల్యాణ మండపంలో పంపిణీ చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్, బాపట్ల ఎంపీ టి.కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్‌బాబు, రామాంజనేయులు ముఖ్యఅతిథులుగా పాల్గొని పంపిణీ చేస్తారని చెప్పారు.

రోడ్లపై వ్యర్థాలను తక్షణం తొలగించండి



తెనాలి అర్బన్: రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఆయన పర్యటించారు. రోడ్లపై భారీగా వినాయక చవితి పత్రి పడి ఉండటాన్ని గమనించిన ఆయన వెంటనే వాటిని తొలగించాలని సూచించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని సిబ్బందికి చెప్పారు. ఆయన వెంట శానిటరి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



తెనాలి అర్బన్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంలోనూ స్థానిక శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి సభ్యుల సేవా కార్యక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. శనివారం 60 ఏళ్ల గుర్తు తెలియని మృతదేహానికి సమితి సభ్యులు తెనాలిలో సంప్రదాయ పద్ధతిలో దహన సంస్కారాలు నిర్వహించారు. సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను కథనం ప్రకారం.. కొల్లూరుకు చెందిన 65 ఏళ్ల వృద్ధుడు అనారోగ్యంతో తెనాలి జిల్లావైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అతనికి ఎవరు లేకపోవడంతో కొల్లూరు పోలీసులు శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృందసేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీనుకు ఫోన్ చేసి దహన సంస్కారాలు నిర్వహించాలని కోరారు. దీంతో ఆయన సభ్యులతో కలసి జిల్లా వైద్యశాలలోని మృతదేహాన్ని ప్రత్యేక వాహనంలో బుర్రిపాలెం రోడ్డులోని మహాప్రస్థానంలో తరలించారు. అక్కడ సంప్రదాయ పద్ధతిలో దహన సంస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో రామకృష్ణ, ప్రకాష్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్ల స్వాధీనం



కొల్లిపర: అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. ఆయన శనివారం రాత్రి సిబ్బందితో కలసి మండలంలోని గ్రామాల్లో గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని మున్నంగిలో ఇళ్ల మధ్య నిల్వ ఉన్న ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ తెలిపారు.

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా !

- వైభవంగా వినాయక చవితి వేడుకలు
- పందిళ్లలో స్వామికి నిత్య పూజలు
- ఉత్సాహంగా పాల్గొంటున్న యువత



15వ వార్డులోని మందిరంలో పూజల్లో మాజీ ఎమ్మెల్యే శివకుమార్



మెడికల్ గణేష్ కమిటీ ఆధ్వర్యంలోని మందిరంలో పూజల్లో మంత్రి మనోహర్



శ్రీసిద్ధి విఘ్నేశ్వరస్వామి మందిరంలో స్వామి



మారీసుపేటలోని శ్రీచంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో విఘ్నేశ్వరుడు

తెనాలి: ఆంధ్రాప్యారిస్ తెనాలిలో వినాయక చవితి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. చవితి రోజున పట్టణ, పరిసరాల్లోని ప్రజలు భక్తి ప్రపత్తులతో గణపతి పూజలు చేశారు. శక్తికొలది ఉండ్రాళ్లు, కుడుములు సమర్పించారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో వివిధ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మందిరాల్లో వేడుకలు భారీగా జరిగాయి. గతేడాదితో పోలిస్తే భారీ వర్షాల కారణంగా మందిరాల సంఖ్య తగ్గింది.

■ మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శనివారం రాత్రి పలుచోట్ల వినాయక మందిరాలను సందర్శించారు. వినాయకుడి పూజల్లో పాల్గొన్నారు. చెంపేటలోని కేఎస్ఎం స్కూల్ వద్ద బాలగణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటైన మందిరాన్ని సందర్శించారు. విఘ్నేశ్వరుడి పూజల్లో పాల్గొన్నారు. నాగసరపు కృష్ణ, నాగసరపు గణేష్ తదితరులు ఆయనకు స్వాగతం పలికారు.

■ గంగానమ్మపేటలో రాధా ఐస్ కంపెనీ వద్ద శ్రీ సిద్ధి వినాయక ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మందిరాన్ని శివకుమార్ సందర్శించారు. అనంతరం 15వ వార్డులో పుట్టా రాఘవయ్య రైస్ మిల్ వద్ద 17వ గణేష్ మహోత్సవాల్లో పాల్గొన్నారు. అక్కడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, కమిటీ బాధ్యులు స్వాగతం పలికారు.

■ 11వ వార్డులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కఠారి హరీష్ ఆధ్వర్యంలో పలు మందిరాలను శివకుమార్ సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. విజయవాడ రోడ్డులోని 59.5 అడుగుల భారీ గణపతిని దర్శించుకున్నారు.ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు అమిరినేని రాజా, కొంజేటి గోపీకృష్ణ స్వాగతం పలికారు.

■ రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన వినాయకుని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విజయవాడ రోడ్డులోని భారీ గణపతిని మంత్రి మనోహర్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో భక్తులు ఏర్పాటు చేసిన గణేష్ ని మండపాలను సందర్శించి విఘ్నేశ్వరుని ఆశీస్సులు అందుకున్నారు. మంత్రి మనోహర్ వెంట పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

■ తెనాలి గంగానమ్మపేటలో మెడికల్ గణేష్ కమిటీ, తెనాలి ఆధ్వర్యంలో నవమి గణపతి మహోత్సవాలు వైభవంగా ఆరంభించారు. ప్రత్యేకంగా కోల్‌కతా నుంచి స్వచ్ఛమైన బంక మట్టితో ప్రకృతి రూపంతో తయారైన 10 అడుగుల వినాయకుడి విగ్రహం ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ. విగ్రహం మీద పచ్చిగడ్డిపై రోజూ నీళ్ల చల్లుతుంటే ఎన్నిరోజులైనా పెరుగుతూ ఉండటం ప్రత్యేకత. ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ బింగుమళ్ల పృథ్వి, గుంటూరు శ్రీనివాసరావు, గుంటూరు హరిసాయికిషోర్ పర్యవేక్షించారు.



గంగానమ్మపేటలో వినాయక మందిరంలో పూజలు

■ స్థానిక గంగానమ్మపేటలో శ్రీ సిద్ధి వినాయక ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో దశమ చవితి వేడుకలు భారీగా చేపట్టారు. రెండోరోజైన ఆదివారం శ్రీసిద్ధి, బుద్ధి సమేత శ్రీవరసిద్ధి వినాయకస్వామి కల్యాణ మహోత్సవాన్ని, విద్యా గణపతి పూజను నిర్వహించారు.

■ స్థానిక 15వ వార్డులోని రామలింగేశ్వరపేట పుట్టా రాఘవయ్య రైస్ మిల్ వద్ద 17వ గణేష్ మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అయిదురోజులు జరిగే వేడుకల్లో రెండోరోజైన ఆదివారం ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు.

== శ్రీ సాయి గణేష్ యూత్ ఆధ్వర్యంలో ద్వితీయ వినాయక చవితి మహోత్సవాలు సుల్తానాబాద్‌లో జరుగుతున్నాయి. ఆలపాటి నగర్‌లోని శ్రీకుమార్ సాయి మందిరంలో భారీ గణనాథుడికి పూజలు చేస్తున్నారు.



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

■ ఆలపాటి రాజా వారధి వద్ద శ్రీసిద్ధి విఘ్నేశ్వర స్వామి మందిరం వద్ద చవితి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. జవ్వాది మల్లికార్జునరావు, జవ్వాది రమేష్, నోముల నాగరాజు, నోముల వెంకట్రావు, బండి శివప్రసాద్ పర్యవేక్షిస్తున్నారు.

■ పట్టణ మారీసుపేటలోని శ్రీబాలత్రిపుర సమేత శ్రీచంద్రమౌళేశ్వర స్వామి ఆలయంలో గల శ్రీవిఘ్నేశ్వరుడికి వినాయక చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

■ పట్టణ 14వ వార్డు వైకుంఠపురం పోతురాజు కాలనీ పల్నాటివారి వీధిలో శ్రీ గణేష్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకల్లో భాగంగా అన్నదానం చేశారు. ఆర్‌పీఐ(ఎ) పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పల్నాటి నాగరాజు, శ్రీ గణేష్ యూత్ కమిటీ సభ్యులు బి.ఏడుకొండలు, బి.నరసింహులు, ఎ.సాంబశివరావు, టి.రమేష్, బి.వెంకటేశ్వరరావు, బి.శ్రీనివాసులు, ఎం.శ్రీనివాసు పాల్గొన్నారు.

■ రూరల్ మండలం కఠెవరంలో కఠెవరం ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో 20వ గణేష్ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం అన్నప్రసాద వితరణ చేశారు. గ్రామ సర్పంచ్ బండికళ్ల ప్రసాద్, పుట్టా రవికుమార్, గోనుగుంట్ల మదన్ మోహన్ పాల్గొన్నారు.

■ వినాయక చవితి సందర్భంగా 8వ వార్డులోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు తాడిబోయిన రమేష్ అభిమానులు ఏర్పాటుచేసిన వినాయక మందిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సందర్శించారు. 15వ వార్డులో ఆ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకల్లోనూ ఆమె పాల్గొన్నారు. వీరితో తాడిబోయిన రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, చాంబర్ ఆఫ్ కామర్స్ తెనాలి చైర్మన్ దేసు శ్రీనివాసరావు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో బొజ్జ గణపయ్యకు పూజలు

కొల్లిపర: వినాయక చవితి సందర్భంగా కొలువు దీరిన బొజ్జ గణపయ్య మండపాలల్లో పూజలందుకుంటున్నాడు. శనివారం మండలంలోని వల్లభాపురం, మున్నంగి, అత్తోట, తూములూరు, కొల్లిపర గ్రామాల్లో ఏర్పాటు చేసిన పందిళ్లలో కమిటీలు ఏకదంతునికి విశేష పూజలు నిర్వహించారు. కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు.
నైవేద్యం సమర్పించి భక్తిశ్రద్ధలతో స్వామిని అర్చించారు. కొన్ని ఉత్సవ కమిటీలు భక్తులకు అన్నదానం నిర్వహించాయి.

భక్తులకు అన్నదానం

తెనాలి అర్బన్: వినాయక చవితి వేడుకల్లో భాగంగా శ్రీ గణేష్ భక్త బృందం ఆధ్వర్యంలో రామలింగేశ్వరపేటలోని పుట్ట రాఘవయ్య రైస్ మిల్ వద్ద ఆదివారం గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ 17 సంవత్సరాల నుంచి వినాయక చవితి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏడు వేల మంది భక్తులకు అన్నదానం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు తాడిబోయిన రామయ్య, పేరం సంజీవరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కుక్కల వాసు, పసి, వివిధ రాజకీయ పార్టీ నాయకులు కొర్రపాటి శ్రీనివాస్, జిడుగు తులసి, గుంటూరు గోపి పాల్గొన్నారు.



వైకుంఠపురం పోతురాజు కాలనీలో అన్నదానం



8వ వార్డులోని వినాయక మందిరంలో చైర్‌పర్సన్ రాధిక పూజలు

వరద బాధితులకు నిత్యావసర వస్తువుల పంపిణీ

తెనాలి అర్బన్: రోటరీ అపద్బంధు ప్రాజెక్టులో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం డిస్ట్రిక్ గవర్నర్ శరత్ చౌదరి ఆదేశాల మేరకు రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లయన్ సిటీ వారి ఆధ్వర్యంలో తెనాలి క్లబ్ సహకారంతో వరద బాధితులకు ఆదివారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. భట్టిప్రోలు, కొల్లూరు మండలాల పరిధిలోని తోకలవారిపాలెం, తూరకపాలెం, ఈపూరులంక, తడికల గుడి, చింతమొట్టు, కనిగిరిలంక, గుంటూరు గూడెం తదితర గ్రామాల్లోని వారికి సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు ఎస్.రాంప్రసాద్, తాళ్ల రాజశేఖరరెడ్డి, హరిహర ప్రసాద్ మాట్లాడుతూ లంక గ్రామాల్లోని 2500 కుటుంబాలకు రూ.25లక్షల విలువ చేసే నిత్యావసర వస్తువులను పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి, ఐఏఎస్ అధికారులు ప్రఖర్ జైన్, సంజన సింహా, పిడుగురాళ్ల క్లబ్ కార్యదర్శి నీరుమళ్ల రాజేష్, తెనాలి క్లబ్ ప్రతినిధులు ఈదర వెంకట పూర్ణచంద్, గుప్తా వెంకటరత్నం, కన్నెగంటి మురళి, జి.వి.నారాయణ, ఈదర శ్రీనివాసరావు, పలువురు అధికారులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



ఈపూరులంకలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

లంక గ్రామాల ప్రజలకు ‘మానవత’ సాయం

తెనాలి: బాపట్ల జిల్లాలో కృష్ణానది వరద బాధితులైన 450 కుటుంబాలకు పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవాసంస్థ మానవత ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కొత్తూరులంక, ఈపూరులంక, అన్నవరపులంక, చిలుమూరులంక, చింతల్లంక, ఆవులవారిపాలెం, తురకపాలేనికి చెందిన బాధిత కుటుంబాలకు ఆవులవారిపాలెం గ్రామ పంచాయతీ ఆవరణలో సరుకులను అందించారు. ఒక్కో కుటుంబానికి రూ.600 విలువైన నిత్యావసరాలను పంపిణీ చేసినట్టు మానవత తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ఓంకార్ ప్రసాద్ వెల్లడించారు. స్వీట్, స్టీల్ బాక్స్,సన్ ఫ్లవర్ ఆయిల్, కందిపప్పు, వేరుశెనగ గుళ్లు, బెల్లం, చింతపండు, ఉల్లిపాయలు, గోధుమ రవ్వ, ఉప్పు పాకెట్, ఎండు మిర్చి, బంగాళాదుంపలు, బీట్ రూట్ కలిపి జ్యూట్ బ్యాగ్‌లో అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ముత్తేవి రవీంద్రనాథ్, కె.ధనలక్ష్మి, డీవీ సోమయ్యశాస్త్రి, రోహిణి, వజ్రాల రామలింగాచారి, ఎ.ప్రభాకర్, రామకృష్ణ, పి.వెంకట్, పరిమి వాసు, మల్లాది అర్జున, కావూరి సాంబశివరావు, మల్లికార్జునరావు, భుజంగరావు, ఫణీంద్ర, నారాయణరావు, దుర్గాప్రసాద్, ఏఎస్ఎన్ కాలేజీ విద్యార్థులు ప్రకాష్, అభిషేక్, ప్రవీణ్, మహేష్‌తో కూడిన 25 మంది బృందం ఈ సేవాకార్యక్రమంలో పాల్గొన్నట్టు వివరించారు.



ఆవులవారిపాలెంలో నిత్యావసరాలతో మానవత బృందం

ఫిజియోథెరపీకి పెరిగిన ప్రాముఖ్యత

ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవంలో వక్తలు

తెనాలి: స్థానిక గంగానమ్మపేటలోని సంజన ఫిజియోథెరపీ కేంద్రంలో ఆదివారం ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని తెనాలి అసోసియేషన్ ఘనంగా నిర్వహించింది. అధ్యక్షుడు డాక్టర్ కంభం వెంకట్‌కుమార్ మాట్లాడుతూ నేడు ఫిజియోథెరపీకి గల ప్రాముఖ్యతను వివరించారు. అత్యాధునిక చికిత్సలను వివరించారు. విజయవాడ, గుంటూరు నగరాలతోపాటు తెనాలిలోనూ ఈ వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ఉపాధ్యక్షుడు డాక్టర్ శరత్ కుమార్ మాట్లాడుతూ రిహాబిలిటేషన్ క్లినిక్ , న్యూరో, ఆర్థో, పీడియాట్రిక్‌లో నిష్ణాతులైన ఫిజియోథెరపిస్టులు ప్రస్తుతం అందుబాటులో ఉన్నారని చెప్పారు. కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ భుజం నొప్పి, కండరాల నొప్పులకు ఫిజియోథెరపీ ద్వారా చక్కటి పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయసాగర్, డాక్టర్ బండారు రవికాంత్, డాక్టర్ కాశీభట్ల విష్ణు ప్రియ, డాక్టర్ సందీప్, డాక్టర్ చిత్ర, డాక్టర్ డేవిడ్, డాక్టర్ భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.



ఫిజియోథెరపీ దినోత్సవంలో అసోసియేషన్ నేతలు

జూదరుల అరెస్టు

తెనాలి రూరల్: పేకాట శిబిరంపై పోలీసులు ఆకస్మిక దాడులు చేసి జూదరులను అరెస్ట్ చేశారు. తెనాలి మండలం జగ్గడిగుంటపాలెంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ పోలీసులు శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 25,200 స్వాధీనం చేసుకున్నారు.

సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ విద్యార్థి సంఘ కార్యవర్గం



తెనాలి అర్బన్: సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ పట్టణ విద్యార్థి విభాగ అధ్యక్షునిగా షేక్ మొహిద్దీన్, ఉపాధ్యక్షునిగా బాలాజీ వరప్రసాద్, కార్యదర్శిగా సయ్యద్ ఇర్ఫాన్, ట్రెజరీగా ఆనస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెనాలిలోని జామీయ మసీదు ఆవరణలో ఆదివారం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులను పలువురు అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో సయ్యద్ ఇమ్రాన్, పి.ప్రశాంత్, కోలా సాయి, ఎ.మహేష్, షేక్ సుభాని పాల్గొన్నారు.

యువతిని వేధిస్తున్న యువకుడిపై కేసు

పట్నంబజారు: యువతిని వేధింపులకు గురి చేస్తున్న యువకుడిపై కేసు నమోదు అయింది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. శ్యామలనగర్‌లో నివాసం ఉండే యువతికి బీటెక్ చదువుతున్న సమయంలో నగరంపాలేనికి చెందిన నిమ్మకాయల శ్రీనివాస్ కుమార్‌తో పరిచయం ఏర్పడింది. ప్రస్తుతం చదువు పూర్తి చేసుకుని హైదరాబాదులో ఉద్యోగం చేస్తోంది. ఈ క్రమంలో శ్రీనివాస్ కుమార్ నిత్యం ఆమెని వెంటపడుతూ వేధింపులు గురి చేయడంతో పాటు, పెళ్లి చేసుకోవాలంటూ ఇబ్బందులు గురి చేశాడు. ఇటీవల ఆమె చేయిపట్టుకుని అమర్యాదగా ప్రవర్తించడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా , కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొని లారీ బోల్తా

ఫిరంగిపురం: ప్రమాద వశాత్తు లారీ డివైడర్‌ను ఢీకొని బోల్తా కొట్టిన ఘటన ఫిరంగిపురంలో ఆదివారం తెల్లవారు జామున జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని షిర్డి నుంచి ఉల్లిపాయల లోడుతో గుంటూరు వస్తున్న లారీ ప్రమాదవశాత్తు ఫిరంగిపురంలోని పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న డివైడర్‌ను ఢీకొంది. దీంతో లారీ బోల్తా కొట్టింది. ఘటనలో లారీలోఉన్న డ్రైవర్ సుభానీ, క్లీనర్‌లకు స్వల్పగాయాలయ్యాయి. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోలీసులు వాహనాలను దారి మళ్లించారు.



వైవిధ్యమైన సినీ నటి భానుమతి ఒక జీవిత పాఠం

శత జయంతి సభలో పాత్రికేయుడు సినీ పరిశోధకుడు రెంటాల జయదేవ

తెనాలి: భారతీయ సినిమాలో అందం, ఆకర్షణ, అభినయం, గాత్రం, సంగీత దర్శకత్వం, దర్శకురాలు, స్టూడియో అధినేత్రి...ఇంతటి వైవిధ్యమున్న సినీనటి భానుమతి మినహా మరొకరు లేరు...ఆమెను ఒక జీవిత పాఠంగా నేటితరం తెలుసుకోవాలని ప్రముఖ పాత్రికేయుడు సినీ పరిశోధకుడు రెంటాల జయదేవ అభిప్రాయపడ్డారు. తెనాలి రామకృష్ణ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో జరిగిన ప్రముఖ సినీనటి భానుమతీ రామకృష్ణ శత జయంతి సభకు చైతన్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి అధ్యక్షత వహించారు. జయదేవ మాట్లాడుతూ ఆరు దశాబ్దాల్లో నటిగా, తల్లిగా, వదినగా, వృద్ధురాలి పాత్రలతో ఆయా కాలాల్లో ప్రభావాన్ని చూపిన గొప్ప నటి భానుమతి చెప్పారు. ఎంజీఆర్, ఎన్టీఆర్, ఏఎన్నార్ వంటి గొప్ప నటులు భానుమతిని గౌరవంగా సంబోధించేవారని తెలిపారు. స్వర్గసీమ సినిమాలో భానుమతి నటనను చూసి తాను నేర్చుకున్నానని శివాజీగణేశన్ చెప్పడం ఆమె ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. దక్షిణాదిలో పద్మశ్రీ తీసుకున్న తొలి నటిగా, రచయిత్రిగా ‘అత్తగారి కథలు’కు ఏపీ సాహిత్య అకాడమీ అవార్డును, తన జీవిత చరిత్ర ‘నాలో నేను’ను జాతీయ అవార్డును స్వీకరించిన మహానటిగా భానుమతి చరిత్రలో నిలిచారని చెప్పారు. తెనాలితో భానుమతి తండ్రికి గల అనుబంధాన్ని గుర్తుచేశారు. విశ్రాంత తెలుగు ప్రొఫెసర్, రచయిత్రి ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి మాట్లాడుతూ బహుముఖీనమైన ప్రతిభ కలిగిన భానుమతి, తాను ప్రవేశించిన ప్రతి రంగంలోనూ సమాజంపై ప్రభావం చూపడం గొప్ప విషయమని తెలిపారు. ఉన్నతమైన వ్యక్తిత్వం, చమత్కారపూరితమైన సంభాషణలు ఆమె సొంతమన్నారు. ‘అభినవ అష్టావధాని’గానూ ప్రశంసలను అందుకున్నట్టు చెప్పారు. సభాధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి మాట్లాడుతూ తెనాలి క్లాసికల్ ఫిలిం సొసైటీ వ్యవస్థాపకుడుగా భానుమతితో గల అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మువ్వా సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. సభానంతరం భానుమతి పాటలతో కూడిన సినీ సంగీత విభావరిని నిర్వహించారు. ప్రముఖ గాయనీ గాయకులు వెంపటి సత్యనారాయణ (తెనాలి), బెల్లంకొండ భారతి (చిలకలూరిపేట) గానాలాపనతో ప్రేక్షకుల కరతాళ ధ్వనులను అందుకున్నారు.



రెంటాల జయదేవకు సత్కారం

బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆవిర్భావ దినోత్సవం

తెనాలి: బ్యాంక్ ఆఫ్ ఇండియా 119వ ఆవిర్భావ వేడుకలు శనివారం ఖాతాదారుల సమక్షంలో వైభవంగా జరిగాయి. సీనియర్ బ్రాంచి మేనేజర్ వి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ బ్యాంకు 1906లో సెప్టెంబర్ 7న ప్రారంభించినట్టు తెలిపారు. తెనాలిలో 1969 నుంచి సేవలు అందిస్తున్నట్టు గుర్తుచేశారు. గంగానమ్మపేటలోని తమ శాఖ రూ.160 కోట్ల వ్యాపారంతో 18 వేల ఖాతాదారులకు సేవలను అందిస్తోందని వివరించారు. తక్కువ వడ్డీ రేట్లకే విద్య, వ్యాపార, వాహన, పొదుపు సంఘాల రుణాలు మంజూరు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, పొదుపు సంఘాల యానిమేటర్లు, ఖాతాదారులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న సిబ్బంది